సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 22 । జనవరి । 2023

సాధు సమ్మేళనం.. శ్రీ కేదారేశ్వర ఆశ్రమం



పలుగుట్టలోని ఆశ్రమంలో నవనాథుల ఆలయం

అఖిలాంధ్ర సాధు పరిషత్తు సందడి

- 57వ సమ్మేళనానికి వేదిక కానున్న నందిపేట పలుగుట్ట
- ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 1వరకు మహాసభలు
- బాలయోగి మంగి రాములు మహరాజ్ సంకల్పంతో..
- వివిధ రాష్ట్రాల నుంచి రానున్న పీఠాధిపతులు, సాధుసంతులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : 'సాధునాం దర్శనం పుణ్యం, స్పర్శనం పాపనాశనం, సంభాషణం కోటి తీర్థం వందనం మోక్ష సాధనం' (జ్ఞానులైన సాధువులను దర్శించడం వల్ల పుణ్యం, వారి పాద స్పర్శతో పాపనాశనం, సంభాషించడంతో అన్ని పుణ్యతీర్థాలలో స్నానమాచడం వల్ల కలిగే పుణ్యఫలం, నమస్కారం చేయడం వల్ల మోక్షదాయకమని భాగవతంలో చెప్పబడింది.)

■ ప్రతిష్టాత్మకమైన అఖిలాంధ్ర సాధు పరిషత్తు 57వ సమ్మేళనానికి జిల్లాలోని నందిపేట వద్ద పలుగుట్ట శ్రీ కేదారేశ్వర ఆశ్రమం వేదిక కానుంది. ఈ నెల 27 నుంచి ఫిబ్రవరి 1 వరకు శ్రీ పరమహంస పరివ్రాజక బాలయోగి రాములు మహరాజ్ స్వామీజీ సంకల్పంతో ఈ మహాసభలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సమ్మేళనానికి దేశంలోని కాశీ, అయోధ్య సహా వివిధ రాష్ట్రాలకు చెందిన పీఠాధిపతులు, సాధుసంతులు 300 మందికి పైగా రానున్నారు. 34 ఏళ్ల కిందట అఖిలాంధ్ర సాధు పరిషత్తు మహాసభలు నిజామాబాద్‌లో జరిగాయి. మళ్లీ ఇప్పుడు పలుగుట్టలో నిర్వహిస్తుండడం విశేషం.



గర్భగుడిలో పూజలు నిర్వహిస్తున్న మంగి రాములు

■ ఈనెల 27న నందిపేటలో వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న సాధుపుంగవులకు కలశములతో నందిపేటలో ఘన స్వాగత సుమాంజలి ఏర్పాటు చేశారు. 28, 29, 30, 31, ఫిబ్రవరి 1 తేదీల్లో మొత్తం 9 మహాసభలు నిర్వహించనున్నారు. కాగా 30న ఉదయం పీఠాధిపతులు, గురువులు, సాధుసంతులతో ఆశ్రమ దైవం శ్రీ కేదారేశ్వర శివాలయ మహాశిఖర మహాసహస్రాభిషేకం 1,331 కలశములతో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

■ గత 30 సంవత్సరాలుగా దసరా పర్వదినం రోజున ఆశ్రమ వ్యవస్థాపకులు మంగి రాములు మహరాజ్ దీక్ష బూని కార్తీక పౌర్ణమి రోజున విరమించడం ఆనవాయితీగా వస్తోంది. ఆశ్రమంలో ప్రతిఏడాది రెండుసార్లు వేడుకలు నిర్వహిస్తారు. దసరా పర్వదినాన మంగి రాములు మహ రాజ్ దీక్ష బూని, కార్తీక పౌర్ణమి రోజు విరమిస్తారు. ఈ సందర్భంగా కార్తీక పౌర్ణమి రోజు పెద్దఎత్తున ఉత్సవాలు జరుపుతారు. అలాగే శివరాత్రికి వేడుకలు నిర్వహిస్తారు.

ఆలయ చరిత్ర..



కేదారేశ్వర ఆలయం

30 సంవత్సరాల క్రితం గేదెల కాపరిగా ఉన్న మంగి రాములు మహరాజ్ పలుగుట్ట ప్రాంతానికి వాటిని మేపేందుకు వెళ్లారు. ఆ సమయంలో పెద్ద పాము కనిపించగా పరుగెత్తారు. ఈ క్రమంలో ఒక వృద్ధుడు మంగి రాములును ఆపి విషయం తెలుసుకున్నాడు. పాము ఏమి చేయదని, అది నీ క్షేమం కోరి వచ్చిందని చెప్పి వెళ్లిపోయాడు. అదే రోజు రాత్రి మంగి రాములు కలలో పాము కనిపించిన చోట శివాలయం నిర్మించమని సదరు వృద్ధుడు ఆదేశించాడని చెబుతారు. భగవంతుడే వృద్ధుడి రూపంలో వచ్చి చెప్పినట్లు విశ్వసించిన రాములు మహరాజ్ పాము కనిపించిన చోట చిన్న కుటీరం ఏర్పాటు చేసుకుని పూజలు ప్రారంభించాడు. అనతి కాలంలోనే ప్రాచుర్యం పొంది అభివృద్ధి చెందిన ఇక్కడ ప్రస్తుతం వివిధ ఆలయాలు ఉన్నాయి. అలాగే రాష్ట్రంలోనే ఎత్తైన నవనాథుల స్థూపం నిర్మించారు. సరస్వతి మందిరం, ఆంజనేయ, దత్తాత్రేయ స్వామి ఆలయాలతో పాటు ఒకే వేదికపై ఐదు వివాహాలు చేసేంత పెద్ద కల్యాణ మండపం ప్రత్యేకంగా ఆకర్షణగా నిలుస్తోంది. వృద్ధాశ్రమం, విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ బోధన లాంటి సేవా కార్యక్రమాలు నడుస్తున్నాయి. ఆశ్రమమంతా పచ్చటి చెట్లతో ఆహ్లాదకరంగా ఉంటుంది. నిత్యం భక్తులతో కిటకిటలాడుతూ ఉంది.



ఘనంగా మాఘమాస జాతర



సంతాయిపేట భీమేశ్వరాలయంలో భక్తుల సందడి

జిల్లాలో శనివారం మాఘమాస వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు వాగులకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. మాఘమాస సందర్భంగా తాడ్వాయి మండలంలోని సంతాయిపేట భీమేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే సురేందర్, మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి భీమేశ్వరాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట నాగమడుగు వద్ద భక్తులు గంగమ్మకు హారతి ఇచ్చారు. మద్నూర్ మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయానికి భక్తులు పోటెత్తారు. మాచారెడ్డి మండలంలోని గజ్యానాయక్ తండా చౌరస్తాలో గల వీర హనుమాన్ వెంకటేశ్వరాలయ ప్రాంగణంలో జాతర సాగింది. జిల్లాలోని పలు ప్రాంతాలలో జాతరలు నిర్వహించారు. – సాక్షి, కామారెడ్డి

'నిస్వార్థంగా సేవ చేయాలి'



ఉత్తమ ఉపాధ్యాయులతో స్పీకర్ పోచారం

బాన్సువాడటౌన్: నిస్వార్థంగా సేవలందించే వారిని సమాజం మర్చిపోదని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో స్పీకర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తే సమాజం బంగారుమయం అవుతుందన్నారు. మహిళలకు ఆస్తులు అక్కర్లేదని, విద్య చాలని, వారి కాళ్లపై వారే నిలబడతారని పేర్కొన్నారు. విద్యతోనే సామాజిక, ఆర్థిక మార్పు వస్తుందన్నారు. పేదరికంలో ఉన్న పేదింటి ఆడపిల్లలు చదువుకోవాలనే సంకల్పంతో ప్రత్యేకంగా వసతి గృహాలు నిర్మిస్తున్నామన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనవారిని స్పీకర్ సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ నీరజావెంకట్‌రాంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, ఆర్డీవో రాజాగౌడ్, నాయకులు అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, కొయ్యగుట్ట శ్రీధర్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్, జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్, ప్రతినిధులు గణపతి, చంద్రశేఖర్, వీరలాల్, వసంత్, లఖ్యా, గోపి, యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీసంత్ మహరాజ్ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పోచారం

బాన్సువాడ టౌన్: తెలంగాణ విశ్వవిద్యాలయ తెలుగు అధ్యయన శాఖ విభాగాధిపతి కొత్వాల్ తుకారాం రాసిన శ్రీ సంత్ మహరాజ్ జీవిత చరిత్ర పుస్తకాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ శ్రీసంత్ మహరాజ్ కులవృత్తిని చేసుకుంటూనే రుక్మిణీ విఠలేశ్వరులపై 133 అభంగాలు రచించారన్నారు. ఆ మహనీయుడి బాటలో అందరూ నడవాలని సూచించారు. కార్యక్రమంలో సుదర్శన దండి స్వామీజీ చేర్యాల నర్సింహమూర్తి, సరస్వతి ఆలయం ధర్మకర్త పోచారం శంభురెడ్డి, ఆలయ అర్చకులు సంతోష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

'వందశాతం ఉత్తీర్ణత సాధించాలి'



కామారెడ్డి రూరల్: ఎస్సెస్సీలో వందశాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో రాజు సూచించారు. శనివారం చిన్నమల్లారెడ్డి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు ఎలా చదువుతున్నారన్న విషయాన్ని తల్లిదండ్రులు రోజూ గమనించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు, టీచర్లకు సలహాలు ఇచ్చారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యా యులు శ్రీనివాస్, ప్రతాపరెడ్డి, బుచ్చిరెడ్డి, ఆకుల బాబు, సుశీల, ఉమాదేవి, ప్రవీణ్, రామకృష్ణ, శ్రీనివాస్, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

24న జాబ్ మేళా

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని మోడల్ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. రిలయన్స్ జియో, ఐటీసీ, వీఎల్ఆర్ గ్రూప్, ఐబీటీ, విజయ బయో తదితర కంపెనీలలో ఉద్యోగాల భర్తీ కోసం ఈ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో మేళాకు రావాలని సూచించారు.

పోర్ట్‌పోలియో జడ్జికి ఘన స్వాగతం



గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి సుధ

కామారెడ్డిటౌన్: జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి సుధ శనివారం జిల్లా కోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తి జైలును సందర్శించి ఖైదీల వసతులు, సదుపాయాల గురించి తెలుసుకున్నారు. ఖైదీలకు కల్పించిన సౌకర్యాలను పర్యవేక్షించారు. ఆమె వెంట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, అడిషనల్ జిల్లా జడ్జీలు లాల్ సింగ్, శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి కిరణ్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేష్ ధ్రువ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వైద్య అమృత్‌రావు, న్యాయవాదులు గంగాధర్, వెంకట్రాంరెడ్డి, శ్రీధర్, రజనీకాంత్, విఠల్‌రావు, నవీన్ పాల్గొన్నారు.

తుపాకీతో కాల్చి చంపారు



ఖలీల్‌వాడి : వన్యప్రాణుల వేటగాడు బనోత్ రావుజీ మొదట నాటు తుపాకీ మిస్‌ఫైర్ అయి మృతి చెందినట్లు వార్తలు వచ్చినప్పటికీ చివరికి హత్యగా తేలింది. ఏసీపీ వెంకటేశ్వర్ శనివారం నిజామాబాద్‌లో మీడియాతో తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బనోత్ రావుజీ కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం సర్దార్‌తండాకు చెందినవాడు. ఈ నెల 18న అర్ధరాత్రి తన మిత్రులైన బనోత్ రాంరెడ్డి, ఆశిర్‌రెడ్డిలతో కలిసి సిరికొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని తూంపల్లి శివారులోగల రిజర్వ్ ఫారెస్టులోకి వన్యప్రాణుల వేటకు వెళ్లాడు. ముగ్గురు మాచారెడ్డి మండలం సర్దార్ తండా నుంచి దేవుడి గుట్ట, మైసమ్మ గుడి మధ్య గల అడవిలోకి వెళ్లారు. రావుజీని బలవంతంగా వేటకు తీసుకువెళ్లడంతో అక్కడ మిగతా ఇద్దరితో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో ఇద్దరు కలిసి నాటు తుపాకీతో రావుజీని హత్య చేశారు. ఘటనపై పోలీసులకు అనుమానం రావడంతో విచారణ చేపట్టారు. మృతుడి భార్య బనోత్ సరిత ఫిర్యాదు మేరకు సిరికొండ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విచారణలో రావుజీని కాల్చి చంపినట్లు తేలడంతో శనివారం నిందితులు ఇద్దరిని రామారెడ్డి మండలం జగదంబా తండా, రెడ్డిపేట చౌరస్తా వద్ద అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. వీరి వద్ద నుంచి రెండు నాటు తుపాకీలు స్వాధీనం చేసుకున్నారు. బానోత్ రాంరెడ్డి గతంలో కామారెడ్డి జిల్లాలో 1995 నుంచి 2000 వర కు పీపుల్స్‌వార్ గ్రూప్‌లో యాక్టివ్ మిలిటెంట్‌గా పని చేశాడు. కంచమల్, సంగోజీపేట ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నాడు. 2000 సంవత్సరంలో పోలీసులకు లొంగిపోయాడు. అప్పటి నుంచి అతని వద్ద తుపాకులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఏసీపీ వెంకటేశ్వర్ అధ్వర్యంలో ధర్పల్లి సీఐ సైద, ఎస్సై నర్సింలు, ఏఎస్సై బాల్ సింగ్, కానిస్టేబుళ్లు లక్ష్మీనారాయణ, రాజు, దేవేందర్, రాకేశ్, హరీశ్, సలీం, కరుణ, హెడ్‌కానిస్టేబుల్ కైలాస్, సాగర్, సంతోష్ చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకొని అరెస్టు చేసినందుకు సీపీ నాగరాజు అభినందించి రివార్డ్ ప్రకటించారు.

జోనల్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



కబడ్డీలో తలపడుతున్న కామారెడ్డి, కరీంనగర్ జిల్లా జట్లు

కామారెడ్డి రూరల్: జిల్లా కేంద్రంలోని విద్యానికేతన్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం అటవీశాఖ రాజన్న జోన్ క్రీడోత్సవాలు ప్రారంభమయ్యాయి. రాజన్న జోన్ సీసీఎఫ్ సైదులు, కామారెడ్డి డీఎఫ్‌వో నిఖిత, సిద్దిపేట డీఎఫ్‌వో శ్రీనివాస్, కరీంనగర్ డీఎఫ్‌వో గోపాల్‌రావు, మెదక్ డీఎఫ్‌వో రవిప్రసాద్ పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పతకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజన్న జోన్ సీసీఎఫ్ సైదులు, డీఎఫ్‌వో నిఖిత మాట్లాడారు. రెండు రోజుల పాటు క్రీడలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జోన్ పరిధిలోని ఐదు జిల్లాల క్రీడాకారులు పాల్గొంటున్నారని, ఇందులో గెలిచిన జట్లు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటాయని పేర్కొన్నారు. బాన్సువాడ ఎఫ్‌డీవో సాగర్, తెలంగాణ ఫారెస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మౌజం అలీఖాన్, పీఈటీలు రంగ వెంకటేశ్వర్‌గౌడ్, నోముల మధుసూదన్‌రెడ్డి, వెంకటి, ప్రభులింగం, అనిల్, సంతోష్, మోహన్‌రెడ్డి, సంజీవ్, లక్ష్మణ్, లక్ష్మణ్‌రాథోడ్, అరుణ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కామారెడ్డి డీఎఫ్‌వో నిఖిత

విజేతలు వీరే...

రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి, మెదక్, కరీంనగర్, సిద్దిపేట జిల్లాలకు చెందిన జట్లు పోటీలలో తలపడ్డాయి. వాలీబాల్ పురుషుల విభాగంలో కామారెడ్డి జట్టు విజేతగా నిలవగా.. కరీంనగర్ ద్వితీయ స్థానం దక్కించుకుంది. కబడ్డీ మహిళల విభాగంలో కామారెడ్డి ప్రథమ, మెదక్ ద్వితీయ స్థానం పొందాయి.

'కంటి వెలుగు'ను పర్యవేక్షించాలి

- వీసీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

కామారెడ్డి క్రైం: కంటి వెలుగు శిబిరాలను పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి కలెక్టర్లకు సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వీ, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేత మహంతిలతో కలిసి కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కంటి వెలుగు శిబిరాలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన కలెక్టర్లను, సంబంధిత అధికారులను సీఎస్ అభినందించారు. రీడింగ్ కళ్లద్దాల స్టాక్‌ను కలెక్టర్‌లు ప్రతి రోజూ పర్యవేక్షించాలన్నారు. ముందుగా సమాచారం అందిస్తే అవసరమైన కళ్లద్దాలను సకాలంలో సరఫరా చేస్తామన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

10,498 మందికి కంటి పరీక్షలు..

కంటి వెలుగులో భాగంగా జిల్లాలో మూడు రోజుల్లో 10,498 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయన సంబంధిత శాఖల జిల్లా అధికారులతో మాట్లాడారు. ఇప్పటివరకు 2,020 మందికి కళ్లద్దాలను అందించామన్నారు. జిల్లాలో ఎక్కడ కూడా డాటా ఎంట్రీలో సమస్యలు ఉత్పన్నం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. క్యాంపు నిర్వహించే కేంద్రాలలో జనాభా ఆధారంగా కనీసం 60 శాతం కళ్లద్దాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పంచాయతీ సెక్రెటరీ, సర్పంచులు కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోజు కచ్చితంగా ఉదయం 9 గంటలకు కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం కావాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, కంటి వెలుగు ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

సోలార్ యూనిట్లపై అవగాహన కల్పించండి

కామారెడ్డి క్రైం: స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులు సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకునేలా ఐకేపీ అధికారులు అవగాహన కల్పించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. కలెక్టరేట్‌లో ఐకేపీ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు చెల్లించాల్సిన అవసరం ఉండదన్నారు. ప్రతినెలా క్రమం తప్పకుండా ఈఎంఐ చెల్లిస్తే సరిపోతుందన్నారు. వచ్చేనెల 10వ తేదీలోగా వంద శాతం బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు వసూలు చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తేనెటీగలు, చేపలు, గేదెలు, కోళ్లు, కూరగాయల పెంపకం వంటి యూనిట్లను ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా బలోపేతం అయ్యేలా అధికారులు చూడాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, డీఆర్‌డీవో సాయన్న, ఎల్‌డీఎం చింతం రమేష్, మెప్మా పీడీ శ్రీధర్‌రెడ్డి, డీపీఎంలు సుధాకర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

క్లుప్తంగా

నేడు ఏఈఈఈ రాత పరీక్ష

నిజామాబాద్‌అర్బన్‌: టీఎస్‌ పీఎస్సీ ఆధ్వర్యంలో ఏఈఈఈ పరీక్షను ఆదివారం నిర్వహించనున్నారు. పరీక్ష కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్‌ నారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు మొదటి పేపర్‌, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో పేపర్‌ పరీక్ష ఉంటుంది. జిల్లా కేంద్రంలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

11 నుంచి టెక్నికల్‌ సర్టిఫికెట్‌ కోర్సు పరీక్షలు

నిజామాబాద్‌అర్బన్‌: టెక్నికల్‌ సర్టిఫికెట్‌ కోర్సు పరీక్షలు ఫిబ్రవరి 11 నుంచి నిర్వహించనున్నట్లు డీఈవో దుర్గాప్రసాద్‌ ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల పాటు పరీక్షలు ఉంటాయన్నారు. త్వరలోనే హాల్‌ టికెట్లు జారీ చేస్తామన్నారు.

ఆర్టీసీ కార్గోను సద్వినియోగం చేసుకోవాలి



ఖలీల్‌వాడి: ఆర్టీసీ కార్గో సేవలను ప్రజలు, వ్యాపారులు సద్వినియోగం చేసుకొవాలని ఆర్‌ఎం ఉషాదేవి కోరారు. శనివారం నిజామాబాద్‌ ఆర్టీసీ బస్టాండ్‌ నుంచి ప్రారంభమైన కార్గో అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. వస్తువులకు ఆర్టీసీ కార్గో ద్వారానే రక్షణ లభిస్తుందన్నారు. ఉమ్మడి నిజామాబాద్‌ కార్గో ఇన్‌చార్జి శంకర్‌, కరీంనగర్‌, ఆదిలాబాద్‌, నిజామాబాద్‌ రీజియన్‌ ట్రాన్స్‌పోర్ట్‌కు చెందిన 55 మంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



వేల్పూర్‌: వేల్పూర్‌కు చెందిన గుగ్గిలం అశోక్‌ జాతీయస్థాయి రన్నింగ్‌ పోటీలకు ఎంపికయ్యాడు. శనివారం మెదక్‌ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి 800 మీటర్ల ఓపెన్‌ రన్నింగ్‌ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఆయన రెండో స్థానం సాధించాడు. దీంతో చండీగఢ్‌లో జరిగే జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. అశోక్‌ రవాణాశాఖలో కామారెడ్డిలో హోంగార్డుగా పనిచేస్తున్నాడు.

కొనసాగుతున్న డిగ్రీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న డిగ్రీ సెమిస్టర్‌ బ్యాక్‌లాగ్‌, రెగ్యులర్‌ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్‌ అరుణ తెలిపారు. ఉదయం జరిగిన డిగ్రీ రెండో సెమిస్టరు బ్యాక్‌లాగ్‌ పరీక్షలో 200 మంది విద్యార్థులకు 187మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్‌ తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఐదో సెమిస్టరు రెగ్యులర్‌, ఆరవ సెమిస్టరు బ్యాక్‌లాగ్‌ పరీక్షలలో 3,193 మందికి 2,975 మంది పరీక్ష రాశారు.

బాల్యం పక్కదారి!

- దావత్‌ల మోజులో చిన్నారులు
- మద్యానికి బానిసలవుతున్న వైనం
- చదువుకోవాల్సిన వయసులో ప్రేమ వ్యవహారాలు
- నిఘా మరిచిన తల్లిదండ్రులు

రెడ్డిపేట గ్రామానికి చెందిన ఓ విద్యార్థి బడికి వెళ్లడం లేదని తండ్రి కొట్టాడు. దీంతో ఆ పిల్లాడు డయల్‌ 100కు ఫోన్‌ చేసి తనను తండ్రి కొడుతున్నాడని ఫిర్యాదు చేశాడు. ఇటీవల రామారెడ్డిలో మైదానంలో పదేళ్లలోపు కొంతమంది చిన్నారులు కలిసి దావత్‌ ఎలా చేసుకుందామని చర్చించుకుంటున్నారు. వారి మాటలు విన్న ఓ అధ్యాపకుడు ఇంత చిన్న వయస్సులో దావత్‌ ఏమిటని ప్రశ్నించగా తలా రూ.వంద జమ చేసుకొని థామ్సప్‌ చికెన్‌ నూడుల్స్‌తో దావత్‌ చేసుకుంటామని, డిసెంబర్‌ 31న తమ ఇంట్లో పెద్దలు మద్యంతో పార్టీ చేసుకుంటారని సమాధామిచ్చారు. ఇలా ఎంతో మంది పసితనం నుంచే పెద్దల మాటలు పెడచెవిన పెడుతూ.. దావత్‌ల మోజులో పడుతున్నారు.

రామారెడ్డి: ఆటపాటలతో హాయిగా సాగాల్సిన బాల్యం పక్కదారి పడుతోంది. చదువుపై శ్రద్ధ పెట్టాల్సిన చిన్నారులు దావత్‌ల మోజులో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. వయసుతో సంబంధం లేకుండా మద్యానికి బానిసలవుతున్నారు. ఫోన్లు, సినిమాల మాయలో పడి పసితనంలోనే ప్రేమ వ్యవహారాలు సాగిస్తున్నారు. చిన్న వయసులో స్నేహితులతో కలిసి విలాసవంతమైన విందులు చేసుకోవడం జీవితంలో భాగంగా నేటి చిన్నారులు, యువత భావిస్తున్నారు. తమ పనుల్లో బిజీగా మారిన తల్లిదండ్రులు పిల్లల గురించి పట్టించుకోకపోవడంతో వారు పెడదారులు తొక్కుతున్నారు. తెలిసి తెలియని స్కూల్‌ వయసులోనే విద్యార్థులు ప్రేమ వలలో చిక్కుకుంటున్నారు. ఆన్‌లైన్‌ క్లాసుల పుణ్యమా అని విద్యార్థులకు ఫోన్లు కొనివ్వడంతో వారు చాటింగ్‌లు చేస్తూ బడి వయసులోనే ప్రేమ వలలో చిక్కి ఇంట్లో నుంచి వెళ్లిపోయి పెళ్లి దాకా వెళ్లుతున్నారు. 15 ఏళ్లలోపు వారు సైతం మద్యం, సిగరెట్లు తాగుతున్నారు. బర్త్‌డే పార్టీల పేరిట రోడ్ల మీద హంగామా చేస్తున్నారు. కొందరు మద్యం తాగి సోషల్‌ మీడియాలో ఫొటోలు సైతం పెడుతున్నారు.

భయం లేకపోవడంతోనేనా!

గతంలో తల్లిదండ్రులు, గురువులు అంటే పిల్లలు భయపడేవారు. ప్రస్తుతం తల్లిదండ్రుల అతిగారాబంతో చిన్నారులకు వారంటే భయం ఉండటం లేదు. ఉపాధ్యాయులు విద్యార్థులను ఎమన్నా అంటే తల్లిదండ్రులు వెళ్లి గొడవ పెట్టుకునే పరిస్థితి ఉంది. దీంతో వారు సైతం మిన్నకుండిపోతున్నారు. ఇటీవల ఉప్పల్‌వాయి గురుకుల వసతి గృహంలో ఓ విద్యార్థి పదే పదే బయటకు వెళ్తున్నాడని ఉపాధ్యాయుడు రెండు దెబ్బలు కొడితే ఆ విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు వచ్చి సదరు ఉపాధ్యాయుడిపై పాఠశాలలోనే దాడి చేశారు.



తల్లిదండ్రుల్లో మార్పు వస్తేనే..

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఫోన్లు, బైకులు, డబ్బులిచ్చి పాఠశాలలకు, కళాశాలలకు పంపితే సరిపోతుందని భావించడంతోనే విద్యార్థులు పక్కదారి పడుతున్నారు. తాము పడుతున్న కష్టాలను తల్లిదండ్రులు తమ పిల్లలకు చూపించాల్సి ఉంది. పిల్లలు ఎటు పోతున్నారో ఓ కంట కనిపెట్టాలి.పిల్లల బాగోగులను ఉపాధ్యాయుల ద్వారా తెలుసుకోవాలి. విద్యార్థి ప్రవర్తనలో మార్పు కనిపిస్తే ఉపాధ్యాయుల సలహాలు తీసుకోవాలి.

తల్లిదండ్రుల నుంచి..



పిల్లలకు తల్లిదండ్రుల నుంచే కల్చర్‌ అలవాటు అవుతుంది. ఇంట్లో పెద్దలు ఎలా ప్రవర్తిస్తే పిల్లలు అలాగే మెలుగుతారు. ర్యాంకుల కన్న క్రమశిక్షణ ముఖ్యమని తెలుసుకోవాలి. సంస్కారం తల్లిదండ్రుల నుంచి వస్తుంది. వినయం విద్య ద్వారా లభిస్తుంది. దండనతోనే విద్యార్థిలో క్రమశిక్షణ వస్తుందని నేను అనుకోను.

– కె స్వర్ణలత, శ్రీచైతన్య విద్యా సంస్థల ప్రిన్సిపాల్‌, కామారెడ్డి

ఆలోచన విధానం మారాలి



పిల్లలకు ఏమిస్తున్నాం. దాని అవసరం ఎంత ఉందని తల్లిదండ్రులు తెలుసుకోవాలి. చిన్న వయసులో అవసరానికి మించి బైకులు, ఖరీదైన ఫోన్లు ఇచ్చి కళాశాలలకు, పాఠశాలలకు వెళ్లి క్రమశిక్షణతో చదవమంటే ఎలా చదువుతారు. పిల్లల విషయంలో తల్లిదండ్రుల ఆలోచన విధానం మారాలి. పిల్లలు పక్కదారి పట్టడానికి వారి చుట్టు పక్కల పరిస్థితులు, స్నేహితులు కూడా కారణమవుతారు.

– శివకుమార్‌గౌడ్‌, చర్లపల్లి జైలు సూపరింటెండెంట్‌

బిల్లులు అందక పరేషాన్‌



మోర్తాడ్‌లో ఉపాధి హామీ నిధులతో చేపట్టిన మురికి కాలువ (ఫైల్‌)

- ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన పనులకు..
- బిల్లులు రాక కాంట్రాక్టర్ల తిప్పలు

మోర్తాడ్‌: ఉపాధి హామీ పథకం ద్వారా మెటీరియల్‌ కంపోనెంట్‌ కింద మంజూరైన నిధులతో పూర్తి చేసిన సీసీ రోడ్లు, మురికి కాలువలు, కల్వర్టుల పనులకు సంబంధించిన బిల్లులు చేతికి అందక ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు పరేషాన్‌ అవుతున్నారు. రానున్న మార్చి నాటికి పనులు చేసి ఏడాది పూర్తి కానుంది. పనులు పూర్తి చేసిన వెంటనే బిల్లులు చేతికి అందాల్సి ఉండగా ఇందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. జిల్లాలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల ఆధారంగా అందులో 40 శాతం నిధులను మెటీరియల్‌ కంపోనెంట్‌ కింద కేటాయించారు. జిల్లా యూనిట్‌గా నిధుల కేటాయింపు జరగటంతో కొన్ని నియోజకవర్గాలకు ఎక్కువ మరికొన్ని నియోజకవర్గాలకు తక్కువ నిధులను కేటాయించారు. గ్రామాల భౌగోళిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఒక్కో గ్రామానికి రూ.10లక్షల నుంచి రూ.50లక్షల విలువ చేసే సీసీ పనులకు ఆమోదం తెలిపారు. జిల్లాలో ఇలా రూ.25 కోట్ల నుంచి రూ.40కోట్ల పనులు సాగాయి. 2022–23 ఆర్థిక సంవత్సరం కిందనే ఉపాధి హామీ మెటీరియల్‌ కంపోనెంట్‌ పనులకు మంజూరు ఇచ్చారు. మార్చిలో పనులకు సాంకేతిక ఆమోదం తెలుపగా ఆర్థిక సంవత్సరం ముగిసిపోక ముందే పనులు మొదలు పెట్టాలని అధికార యంత్రాంగం ఒత్తిడి తీసుకవచ్చింది. అనేక మంది సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు తమ గ్రామాలకు మంజూరైన నిధులతో వారే పనులు చేపట్టారు. ఇప్పటి వరకు కేవలం 10 శాతం బిల్లులే మంజూరు అయ్యాయి. మిగిలిన బిల్లులు చేసి పంపినా నిధుల కొరత కారణంగా చెల్లింపులు జరుగలేదు. అప్పులు చేసి పనులు పూర్తి చేస్తే బిల్లులు మంజూరు కాకపోవడంతో వడ్డీలు కట్టలేక ఆర్థికంగా నష్టపోతున్నామని ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లు వాపోతున్నారు. ఇది ఇలా ఉండగా పెండింగ్‌లో ఉన్న బిల్లుల విషయంలో పనులు పూర్తి చేసిన వారు ఇంజినీరింగ్‌ అధికారులను సంప్రదిస్తే తాము బిల్లులు చేసి పంపించామని ప్రభుత్వం నుంచి చెల్లింపులు జరుగాల్సి ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు. పొరుగు జిల్లాల్లో ఇప్పటికే అనేక మంది ప్రజాప్రతినిధులు ప్రభుత్వం తీరుపై అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఆందోళన కార్యక్రమాలను నిర్వహించారు. మన జిల్లాలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే అధిష్టానం ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని ప్రభుత్వ పెద్దలే బిల్లులు ఇప్పించాలని పలువురు కోరుతున్నారు.

ముగిసిన సాఫ్ట్‌బాల్‌ శిక్షణ శిబిరం



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఆర్మూర్‌టౌన్‌: ఆర్మూర్‌లోని పిప్రిరోడ్డులో గల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో సీనియర్‌ పురుషుల సాఫ్ట్‌ బాల్‌ శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. శిక్షణలో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా జట్టుకు ఎంపికచేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్‌ దుర్గారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. జయశంకర్‌ భూపాలపల్లి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్‌ పురుషుల సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో జిల్లా జట్టు పాల్గొననుంది. జిల్లా సాఫ్ట్‌ బాల్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగమోహన్‌, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లేష్‌గౌడ్‌, అనిల్‌, పాఠశాల ఉపాధ్యాయులు వెంకులు, వెంకటేశ్వర్లు, కోచ్‌ నరేష్‌ పాల్గొన్నారు.

లే ఆఫ్‌ ఎత్తి వేయాలి



బోధన్‌టౌన్‌: నిజాం చెక్కర కార్మగారం లే ఆఫ్‌ను ఎత్తి వేసి కార్మికుల ఆకలి బాధలు తీర్చాలని కార్మికులు, కాంగ్రెస్‌, బీజేపీ, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. లేఆఫ్‌ ఎత్తి వేయాలని శనివారం కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పోలీసులు అక్కడికి చేరుకొని వారిని అరెస్టు చేసి పోలీస్‌ స్టేషన్‌కు తరలించారు. ఈ ధర్నాలో కాంగ్రెస్‌ నాయకులు నవీన్‌కుమార్‌, ఖలీం, బడు, రిజ్వాన్‌, ఫయాజ్‌, బీజేపీ నాయకులు కొలిపాక బాలరాజు, సుధాకర్‌చారీ, కార్మికులు బాలకృష్ణ, సురేష్‌, విజయ్‌ ఉన్నారు.

ఉమ్మడి జిల్లా పబ్లిక్‌ ప్రాసిక్యూటర్ల సమావేశం

ఖలీల్‌వాడి: ఉమ్మడి జిల్లాకు చెందిన పబ్లిక్‌ ప్రాసిక్యూటర్ల సమావేశం శనివారం జిల్లా కోర్టులో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా డైరెక్టర్‌ ఆఫ్‌ ప్రాసిక్యూషన్‌ పి లక్ష్మీనర్సయ్య హాజరయ్యారు. న్యాయస్థానంలో పోలీసుల పాత్ర, కేసులకు గురించి పరస్పరం చర్చించుకున్నారు. నేరస్తులకు శిక్షలు పడాలని, ఫిర్యాదుదారులకు న్యాయం జరగాలన్నారు. సమావేశంలో జిల్లా పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రవిరాజ్‌, అదనపు ప్రాసిక్యూటర్లు కవితారెడ్డి, వసంత, రమేష్‌, దామోదర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రమేష్‌, సామయ్య, రహీమొద్దీన్‌, వీరయ్య, రాజేష్‌, రాణీ, నరేందర్‌, రాజేశ్వర్‌, అశోక్‌, శివరామ్‌నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన పబ్లిక్‌ ప్రాసిక్యూటర్లు

ఆటో డ్రైవర్‌ నిజాయితీ



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ మండలం కంజర గ్రామానికి చెందిన మేహరున్నిసా శనివారం వీక్లీ మార్కెట్‌లో పర్సు పోగొట్టుకున్నారు. పర్సులో రెండు గ్రాముల బంగారు కమ్మలు, రూ.5,500 ఉన్నాయి. ఆ పర్సు ఆటో డ్రైవర్‌ రహీంఖాన్‌కు దొరకగా ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు పర్సును బాధితురాలికి అప్పగించారు.

క్రైం కార్నర్‌

విద్యుత్‌ షాక్‌తో ఒకరి మృతి



కర్యవార్‌ మోహన్‌(ఫైల్‌)

మద్నూర్‌(జుక్కల్‌): మండలంలోని సలాబత్‌పూర్‌లో శనివారం విద్యుత్‌ షాక్‌తో కర్యవార్‌ మోహన్‌(35) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మద్నూర్‌కు చెందిన కర్యవార్‌ మోహన్‌ కూలీ పని చేస్తాడు. సలాబత్‌పూర్‌లో మేస్త్రీ పని చేస్తుండగా విద్యుత్‌ వైర్‌ తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మోహన్‌కు భార్య సురేఖ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

తాడ్వాయి: మండలంలోని చందాపూర్‌ గ్రామానికి చెందిన కమ్మరి స్వామి(41) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాలు.. స్వామి కొన్నేళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడన్నారు. ఆస్పత్రుల్లో చూపెట్టుకున్న నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెందిన స్వామి ఈ నెల 19న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటంబ సభ్యులు చికిత్స నిమితం కామారెడ్డి హాస్పిటల్‌కు తరలించారు. స్వామి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ స్వామి శనివారం ఉదయం మృతి చెందాడు.

రెండు ఆలయాల్లో చోరీ



ధ్వంసమైన హుండీ

కామారెడ్డి క్రైం: పట్టణంలోని వీక్లి మార్కెట్‌లో ఉన్న రెండు ఆలయాల్లో శనివారం తెల్లవారు జామున దొంగలు పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీ రాజరాజేశ్వరి ఆలయం, మత్తడి పోచమ్మ ఆలయాల్లో దొంగలు పడి హుండీలను ధ్వంసం చేశారు. చిల్లర డబ్బులతోపాటు కొన్ని వస్తువులను అపహరించినట్లు స్థానికులు తెలిపారు. అంతేకాకుండా కొద్ది దూరంలో ఉన్న పాన్‌షాపు తాళం పగలగొట్టి చోరీకి యత్నించారు. విలువైన వస్తువులేమి చోరీకి గురికాలేదు. ఘటన స్థలాన్ని పట్టణ పోలీసులు పరిశీలించి విచారణ జరిపారు. కేసు నమోదు చేశామని ఎస్‌హెచ్‌వో నరేష్‌ తెలిపారు.

పరీక్ష రాసి వచ్చేలోపు సెల్‌ఫోన్లు..

ఖలీల్‌వాడి: నగరంలోని పద్మానగర్‌ రోడ్డు నంబర్‌ 3లో గల ఓ ప్రైవేట్‌ డిగ్రీ కళాశాల వద్ద నాలుగు సెల్‌ఫోన్లు, నగదు చోరీ అయింది. కాలేజీలో డిగ్రీ పరీక్షలు కొనసాగుతున్నాయి. పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్లు అనుమతి లేకపోవడంతో విద్యార్థులు ద్విచక్రవాహనంలో పెట్టుకున్నారు. పరీక్ష రాసి వచ్చే లోపు నలుగురి ఫోన్లు, నగదు దొంగ ఎత్తుకెళ్లాడు. దీంతో విద్యార్థులు నాలుగో టౌన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కుమారుడితో సహా తల్లి అదృశ్యం

నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధి ధర్మారం గ్రామానికి చెందిన ఓ తల్లి తన కుమారుడితో సహా అదృశ్యమైనట్లు శనివారం ఎస్సై జి లింబాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన దీపిక ఈ నెలా 7న మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి వస్తానని ఏడాది వయసు గల కుమారుడితో బయలుదేరింది. ఆమె తిరిగి ఇంటికి రాలేదు. దాంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆమె భర్త జగన్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అయ్యవారిపల్లిలో ఒకరు..

భిక్కనూరు: మండలంలోని అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన ఒకరు అదృశ్యమైనట్లు ఎస్సై ఆనంద్‌గౌడ్‌ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన వెంకయల పెద్దులు ఈ నెల 16న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. పెద్దులు మద్యానికి బానిసై ఇంటి వారితో తరచు గొడవపడేవాడని ఆయన భార్య సరస్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

నిల్వ ఉంచిన పత్తి దగ్ధం



మంటలను ఆర్పివేస్తున్న దృశ్యం

మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్‌(ఎం)లో శనివారం నిల్వ ఉంచిన 80 క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. గ్రామానికి చెందిన సురభి నర్సింగరావు, మద్దికుంట రమేష్‌ కలిసి ఏడు ఎకరాల్లో పత్తి సాగు చేశారు. వచ్చిన పంటను నర్సింగరావు ఇంట్లో నిల్వ ఉంచారు. విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌తో నిప్పంటుకొని మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన నర్సింగరావు ఫైర్‌ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. అప్పటికే పత్తి కాలిపోయింది.

యువతులకు ఉపాధి కల్పిస్తాం

- మహిళా సహకార అభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్‌ ఆకుల లలిత



మాట్లాడుతున్న ఆకుల లలిత

ఆర్మూర్‌: మహిళా ప్రాంగణంలో ఐటీ బేస్‌ కార్యక్రమంలో శిక్షణ పొందుతున్న నిరుద్యోగ యువతులకు ఉపాధి కల్పిస్తామని టీఎస్‌ మహిళా సహకార అభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్‌పర్సన్‌ ఆకుల లలిత అన్నారు. పెర్కిట్‌లో గల దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం(మహిళా ప్రాంగణం)లో టీఎస్‌ మహిళా సహకార అభివృద్ధి సంస్థ, దీన్‌ దయాల్‌ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన ప్రాజెక్టు కింద ఇస్తున్న శిక్షణను శనివారం ఆమె పరి శీలించారు. రాష్ట్రంలోని 10 ప్రాంగణాల్లో ఈప్రాజెక్టు కింద శిక్షణ పొందుతున్న నిరుద్యోగ మహిళలకు ఉపాధి కల్పించడానికి ఐటీ సంస్థలతో మాట్లాడామన్నారు. డిగ్రీ, బీటెక్‌ చదివిన 75 మంది యువతులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో గ్రామీణ యువతులకు ఐటీ రంగంలో శిక్షణ ఇచ్చే విధంగా చూస్తామన్నారు. ఫిబ్రవరిలో మహిళా ప్రాంగణంలో ఆరోగ్య కార్యకర్తల శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో బ్యూటిషియన్‌, కుట్టు శిక్షణ కేంద్రాలు త్వరలో ప్రారంభమవుతాయని చెప్పారు. శిక్షణ పొందుతున్న యువతులకు పుస్తకాలను అందజేశారు. మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్‌ డి పద్మ, జూనియర్‌ అసిస్టెంట్‌ రాజశ్రీ, రామ్‌ మనోహర్‌, సీహెచ్‌ పద్మ, మాట్రిన్‌ నిఖిత, శ్వేత, విజయ పాల్గొన్నారు.

మహిళా సాధికారతతో దేశప్రగతి



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయమూర్తి శ్రీదేవి

ఖలీల్‌వాడి: మహిళల సాధికారతతో దేశ ప్రగతి పెరిగిందని హైకోర్టు న్యాయమూర్తి శ్రీదేవి అన్నారు. శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని పోలీస్‌ పరేడ్‌ గ్రౌండ్‌లో మహిళా సాధికారతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు జడ్జి ముందుగా ఆర్‌అండ్‌బీ అతిథి గృహం చేరుకొని పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జిల్లా జడ్జి కె.సునీత, కలెక్టర్‌ నారాయణరెడ్డి, సీపీ నాగరాజు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం పరేడ్‌ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. న్యాయవ్యవస్థలో మహిళలకు ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. మహిళలు దేశ ప్రగతికి సారథులు కావాలన్నారు. అనంతరం కలెక్టర్‌ నారాయణరెడ్డి మాట్లాడారు. ప్రభుత్వం వివిధ శాఖల్లో సుమారు లక్ష ఉద్యోగాలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్‌లు జారీ చేస్తోందన్నారు. ఈ అవకాశాన్ని యువత అందిపుచ్చుకోవాలన్నారు. లక్ష్య సాధనకు అడ్డంకిగా నిలిచే సెల్‌ ఫోన్‌ వంటి వ్యాపకాలను పక్కనపెట్టి, పూర్తిగా లక్ష్యంపైనే గురిపెట్టాలని సూచించారు. జిల్లా జడ్జి సునీత కుంచాల, సీనియర్‌ సివిల్‌ జడ్జి పద్మావతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్‌, చిత్రామిశ్రా, అదనపు డీసీపీ అరవింద్‌ బాబు, నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు గణపతి పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ధైర్యం నింపడానికే పరీక్షా పే చర్చ



విద్యార్థిని అభినందిస్తున్న ఎంపీ అర్వింద్‌

నిజామాబాద్‌అర్బన్‌: విద్యార్థుల్లో ధైర్యం నింపడానికే పరీక్ష పే చర్చ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీ ధర్మపురి అర్వింద్‌ అన్నారు. శనివారం కాకతీయ ఒలింపియడ్‌ పాఠశాల, బోర్గాం(పి), ఆదర్శ హిందీ మహ విద్యాలయాల్లో పరీక్ష పే చర్చ నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని తొలగించడానికి ఎగ్జామ్‌ వారియర్స్‌ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ పోటీలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ధన్‌పాల్‌ లక్ష్మీబాయి విఠల్‌ గుప్తా చారిటబుల్‌ ట్రస్ట్‌ ద్వారా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ధనపాల్‌ సూర్యనారాయణగుప్తా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బస్వ లక్ష్మీ నర్సయ్య మోహన్‌రెడ్డి, పోతన్కర్‌ లక్ష్మీనారాయణ, న్యాలం రాజు, నాగొల్ల లక్ష్మీనారాయణ గోపిడి స్రవంతిరెడ్డి, పంచరెడ్డి లింగం, ప్రవళిక కాకతీయ విద్యా సంస్థల చైర్మన్‌ రజినీకాంత్‌ పాల్గొన్నారు.

మాదాపూర్‌ను దత్తత తీసుకున్న వైద్య విద్యార్థులు



ఆరోగ్య వివరాలు సేకరిస్తున్న వైద్య విద్యార్థి

మాక్లూర్‌: ప్రభుత్వ మెడికల్‌ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు మాక్లూర్‌ మండలం మాదాపూర్‌ గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. మాదాపూర్‌ ఆరోగ్య ఉప కేంద్రంలో శనివారం మెడికల్‌ కళాశాల కమ్యూనిటీ మెడిసిన్‌ విభాగం ప్రొఫెసర్లు డాక్టర్‌ దినేష్‌ ఆధ్వర్యంలో దత్తత తీసుకున్నారు. సర్పంచ్‌ లింగరావ్‌ లక్ష్మి మాట్లాడుతూ.. మాదాపూర్‌ గ్రామన్ని దత్తత తీసుకోవడంపై ఆనందం వ్యక్తం చేశారు. ప్రొఫెసర్‌ దినేష్‌ మాట్లాడుతూ.. ఎన్‌ఎంసీ(నేషనల్‌ మెడికల్‌ కౌన్సిల్‌) నిబంధనల ప్రకారం మెడిసిన్‌ చదివే ప్రతి విద్యార్థి తన మొదటి బ్యాచ్‌లోనే ఒక గ్రామాన్ని దత్తత తీసుకోవాలని నిబంధన ఉందన్నారు. ఇందులో భాగంగానే మాదాపూర్‌ గ్రామాన్ని దత్తత తీసుకున్నామన్నారు. ఒక్కో జూనియర్‌ డాక్టర్‌ ఒక్కో ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య వివరాలను నమోదు చేసుకుంటారన్నారు. ప్రతి మూడో శనివారం ఆ ఇంటిని సంబంధిత జూనియర్‌ వైద్యుడు సందర్శిస్తారన్నారు. ఇలా ఐదు సంవత్సరాల పాటు నిర్వహిస్తామన్నారు. మొదట 40 మంది జూనియర్‌ వైద్యులు గ్రామంలో ఇంటింటికి తిరిగి వివరాలు నమోదు చేసుకున్నారు. మాక్లూర్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ సరిత మాట్లాడుతూ కుటుంబాల దత్తత ప్రోగ్రాం మాదాపూర్‌లో ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. సీహెచ్‌వో ఆనంద్‌, సూపర్‌వైజర్‌ దేవపాదం, ఏఎన్‌ఎం సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సండే క్లాసిఫైడ్స్‌

SERVICES

ఆయుర్వేదాలయం

■ అన్ని రకముల మందులు, కీళ్ల నొప్పులు, ఉబ్బసం, చర్మ వ్యాధులు, పైల్స్‌, మధుమేహం, సెక్స్‌ సమస్యల ప్రభావవంతమైన ఫలితం, వాజీకరణం. డా॥ అశోక్‌ త్రిపాఠి-సెల్‌: 7738897455 [K-1141937]

BUSINESS OFFER

■ We Super Stockist of FMCG Products of Masalas & Deserts is looking for District wise Distributors in TS & AP. www.mleps.in Cont: 70329 43367 [Y-748948]

REAL ESTATE

PLOT FOR SALE

■ Plot For Sale: in Arya Nagar Layout Colony, West face 234sq yard(38.6x54.6), can be devide in 2 plots 117sq yard (19.3x54.6), 50 mts to Hyderabad road, NZB. Contact: 9963087337, 9908993063 [G-5971]

WANTED

■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్‌ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్‌ చేయండి. 9959617233, 7022254436. [M-1190551]

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్‌ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్‌ కొరకు 9059509586 [G-776049]

■ విజయవాడలో A/c & Coolers రెంటల్‌ (towerac.com) కంపెనీకి A/c టెక్నీషియన్స్‌-3, బోస్ట్‌ డ్రైవరు-3, హెల్పర్లు-5, జీతం: 18-25,000 ట్రైనింగ్‌/భోజనం/వసతి ఫ్రీ ✆ 90300 44646. [B-1226251]

■ అంజన్న హోమ్‌కేర్‌ పెద్దవారికి పేషెంట్‌ కేర్‌ / ఇంటి / వంటపని చేయుటకు ఆయాలు, వార్డ్‌బాయ్స్‌, Exp. స్త్రీ/పు/నర్సులు కావలెను. జీతం: 18,000/- నుండి 25,000/- వరకు ఇవ్వబడును. కూకట్‌పల్లిలో Hyd. Ph: 9966568882, 9963489661. [HA-900]

■ షిర్డీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్‌, లేడీ సూపర్‌ వైజర్స్‌, నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. Ph: 9391036931, 9246585901. [HA-10046]

■ పనివారు కావలెను. హైదరాబాద్‌, బెంగుళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-792805]

■ ఇంటి దగ్గర ఉంటూ మా ఇన్వెస్ట్‌మెంట్‌ బిజినెస్‌కి సంబంధించిన కాల్స్‌ మాట్లాడటానికి ఫీమేల్‌ స్టాఫ్‌ అ॥ కా॥ను. కమిషన్‌+బోనస్‌+జీతం, ఇంట్రెస్టెడ్‌గా ఉన్నవారు డిటెయిల్స్‌ వాట్సాప్‌ చేయగలరు - 6281159171 [HA-28284]

■ నిరుద్యోగులకు శుభవార్త! Hyd ఓల్డేజ్‌ హోమ్‌ & హోమ్‌కేర్‌ నందు పనిచేయుటకు యువతీ / యువకులు కావలెను. వ:18 to 40 yrs, M/F, 10th - డిగ్రీ Pass / Fail తీసుకోబడును. ANM / GNM / నర్సులు కావలెను. M/F ఉచిత శిక్షణ, వసతి భోజనం. జీతం: 18K to 36K. Ph: 9515750369 / 9160960943 [H-776391]

■ త్రివేణి హోంకేర్‌ హైదరాబాద్‌ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్‌/నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 18K ఏజెంట్‌ కమీషన్‌ 3K. Ph: 7569955551/ 9848571888 [H-786823]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్‌ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్‌ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్‌ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్‌ / డిపాజిట్‌ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.